క్లుప్తంగా

చిన్నారికి దీవెన ఫౌండేషన్ ఆర్థిక సాయం



ఉంగుటూరు: గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతున్న ఎనిమిది రోజుల చిన్నారికి విజయవాడ సిటీ పోలీస్ కమిషనరేట్ నిర్వహిస్తున్న దీవెన ఫౌండేషన్ రూ.10 వేల ఆర్థిక సాయం అందజేసి దాతృత్వాన్ని చాటుకున్నారు. ఉంగుటూరు మండలం ఆత్కూరుకు చెందిన రాణి తన చిన్నారికి బుధవారం సర్జరీ చేయాల్సి ఉందని సాయం కోసం దీవెన ఫౌండేషన్‌ను ఆశ్రయించింది. తక్షణమే స్పందించిన ఆత్కూరు ఏఎస్ఐ రామారావు, మహిళా కానిస్టేబుల్ సత్తెమ్మ చిన్నారి తల్లి వద్దకు వెళ్లి రూ.10 వేలు ఆర్థిక సాయాన్ని మంగళవారం అందజేశారు. పేదలకు, ఆపదలో ఉన్నవారికి సాయం చేస్తున్న ఫౌండేషన్ సభ్యులకు తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారు.

దివ్యాంగురాలికి ఎమ్మెల్యే వంశీ ఆర్థిక చేయూత



అంబాపురం(విజయవాడరూరల్): అంబాపురం గ్రామానికి చెందిన దివ్యాంగురాలు నూతక్కి రూపాదేవికి ఎమ్మెల్యే వల్లభనేని వంశీ మోహన్ పదివేల రూపాయల ఆర్థిక సహాయం పంపారు. ఆ మొత్తాన్ని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ గ్రామ కన్వీనర్ నల్లమోతు చంద్రశేఖర్, పార్టీ నాయకులు తోడేటి బెంజిమెన్, గ్రామ పంచాయతీ కార్యదర్శి విజయ్, వెల్ఫేర్ సెక్రటరీ వినయ్ మంగళవారం ఆమెకు అందజేశారు.

ప్రభుత్వ పాఠశాలలకు సహకారం



పెనమలూరు: ప్రభుత్వ పాఠశాలలకు సహాయ సహకారాలు అందిస్తామని బ్యాంక్ ఆఫ్ ఇండియా జోనల్ మేనేజర్ బంగార్రాజు అన్నారు. పెనమలూరు జెడ్పీ ఉన్నత పాఠశాలలో కంకిపాడు బ్యాంక్ ఆఫ్ ఇండియా శాఖ రూ 2.83 లక్షల విలువ చేసే తాగునీటి ఆర్‌ఓ ప్లాంట్‌ను బహూకరించారు. దీన్ని జెడ్ఎం బంగార్రాజు ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచి లింగాల భాస్కరరావు, న్యాయవాది గొట్టిపాటి రామకృష్ణప్రసాద్, హెచ్‌ఎం వై.దుర్గాభవాని, పేరెంట్స్ కమిటీ అధ్యక్షురాలు లక్ష్మి, సిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నలందలో ఘనంగా కృష్ణాష్టమి



కంకిపాడు: ఈడుపుగల్లు నలంద విద్యానికేతన్‌లో మంగళవారం కృష్ణాష్టమి వేడుకలు వైభవంగా నిర్వహించారు. కృష్ణుడు, రాధ, గోపికల వేషధారణలో చిన్నారుల ప్రత్యేక ప్రదర్శన అలరించింది. ఉట్టికొట్టే సన్నివేశం ఆనందోత్సాహాల నడుమ సాగింది. వేడుకలను ప్రిన్సిపాల్ జె.పద్మావతి పర్యవేక్షించారు.

నైపుణ్యంతో కూడిన విద్య అవసరం



రామవరప్పాడు: విద్యార్థులు ఉన్నత శిఖరాలకు ఎదగాలంటే నైపుణ్యంతో కూడిన విద్య అవసరమని ఆంధ్రప్రదేశ్ ఔషధ మండలి రిజిస్ట్రార్ డాక్టర్ విలియం కేరి అన్నారు. విజయవాడ రూరల్ మండలం ఎనికేపాడులోని విజయ మహిళా ఫార్మసీ కళాశాలలో మంగళవారం 2022–23 సంవత్సరంలో డిగ్రీ పూర్తి చేసిన విద్యార్థులకు గ్రాడ్యుయేషన్ డే నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన విలియం కేరి మాట్లాడుతూ ఔషధ రంగంలో ఉద్యోగావకాశాలు పుష్కలంగా ఉన్నాయన్నారు. ఫార్మసీ విద్యార్థులు తమ ఆలోచనా శక్తికి పదును పెట్టి మరింత ప్రభావవంతమైన ఔషధాలు తయారు చేయాలని సూచించారు. భారతీయ ఔషధ మండలి ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ సభ్యులు డాక్టర్ ఎం. వెంకటరమణ మాట్లాడుతూ కరోనా కష్టకాలంలో ప్రపంచ దేశాలకు మనదేశం విజయవంతంగా మందులను ఎగుమతి చేసిందన్నారు. అనంతరం అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన బీ ఫార్మసీ, ఫార్మా డి, ఎం ఫార్మసీ విద్యార్థులకు పతకంతో పాటు ధ్రువ పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో డాక్టర్ కోలా విజయ శేఖర్, డాక్టర్ ఎస్.శంకర్, ప్రిన్సిపాల్ పద్మలత, అధ్యాపకులు పాల్గొన్నారు.

మార్గదర్శకులు ఉపాధ్యాయులు

- ఘనంగా గురు పూజోత్సవం
- ఉపాధ్యాయులకు సత్కారం



పెనమలూరులో ఉపాధ్యాయులను సన్మానిస్తున్న ఎమ్మెల్యే పార్థసారథి

పెనమలూరు: మార్గదర్శకులు ఉపాధ్యాయులు అని, వారు ప్రభుత్వం పాఠశాలల బలోపేతానికి కృషి చేయాలని ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి అన్నారు. పేద విద్యార్థుల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. పెనమలూరు మండల పరిషత్ కార్యాలయం వద్ద మంగళవారం జరిగిన ఉపాధ్యాయ దినోత్సవంలో ఎమ్మెల్యే పార్థసారథి డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ ఫొటోకు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ నేడు రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలలను ప్రభుత్వం రూ.16 వేల కోట్లతో పూర్తి స్థాయిలో అభివృద్ధి చేసిందన్నారు. అలాగే ప్రభుత్వ ఉపాధ్యాయులకు తగిన గుర్తింపునిచ్చిందన్నారు. అంతర్జాతీయ స్థాయిలో విద్యార్థులు రాణించటానికి ఇంగ్లిష్ మీడియం ప్రభుత్వ పాఠశాలల్లో ప్రవేశ పెట్టారని తెలిపారు. సమాజంలో ఉన్నత మార్పులు రావాలంటే ఉపాధ్యాయులు ప్రేరణతో పని చేయాలని సూచించారు.

పెనమలూరు: కానూరు కేసీపీ సిద్ధార్థ ఆదర్శ రెసిడెన్షియల్ పాఠశాలలో జరిగిన ఉపాధ్యాయ దినోత్సవంలో ప్రొఫెసర్ ఎంసీ.దాస్‌ను పాఠశాల కన్వీనర్ వీరపనేని శశికళ సన్మానించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మనోజ్‌కర్మాకర్, వైస్ ప్రిన్సిపాల్ సాయి కృష్ణ తదితరులు పాల్గొన్నారు. వీఆర్ సిద్ధార్థ ఇంజినీరింగ్ కాలేజీలో ఎన్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో వేడుకలు జరిగాయి. పోరంకి విజ్ఞాన్‌భారత్ పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో ప్రొఫెసర్ కొడాలి రామశేషాద్రిరావు ఉపాధ్యాయులను సన్మానించారు. కానూరు సెయింట్ థెరిస్సా ప్రిన్సిపాల్ సిస్టర్ జాయిసిని అందించిన సేవలకు నెహ్రూ యువ కేంద్రం అధికారులు సుంకరరాము, సీతారామయ్య ప్రశంసాపత్రం అందజేశారు. పోరంకి వికాస్ మోడల్ స్కూల్‌లో కరస్పాండెంట్ చిగురుపాటి వివేకానంద ఆధ్వర్యంలో వేడుకలు జరిగాయి..

ఉపాధ్యాయులకు ఘన సన్మానం

ఎమ్మెల్యే పార్థసారథి ఉత్తమ ఫలితాలు సాధించిన ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. మండల పరిషత్ వద్ద వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో పెనమలూరు సర్పంచి లింగాల భాస్కరరావు, ఎంపీడీఓ సునీతాశర్మ, తహసీల్దార్ వెంకట శివయ్య, ఎంఈఓలు కనకమహాలక్ష్మి, శేషగిరిరావు, ఏవో లోయ శివశంకరరావు, వైఎస్సార్ సీపీ నేతలు పాషా, చక్క గోపీకృష్ణ, రహీం, వేమూరి రాజా తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా టీచర్స్ డే

ఉంగుటూరు: మండలంలో పలు గ్రామాల్లో మాజీ రాష్ట్రపతి డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకుని మంగళవారం ఉపాధ్యాయ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆత్కూరు జెడ్పీ హైస్కూల్ హెచ్ఎం సుధాకర్‌ను గన్నవరం రోటరీ క్లబ్ అధ్యక్షుడు విజయభూషణ్ కుమార్ ఘనంగా సన్మానించారు. హైస్కూల్ సైన్స్ ల్యాబ్ అభివృద్ధికి రూ.10 వేలు విరాళం అందజేశారు.

పలు ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మండల పరిషత్ కార్యాలయం వద్ద ఎంపీడీవో శేషగిరిరావు, సిబ్బంది రాధాకృష్ణన్ చిత్రపటానికి నివాళులర్పించారు.

గన్నవరంలో..

గన్నవరం: ఉపాధ్యాయ దినోత్సవం మంగళవారం మండల వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. అజ్జంపూడిలోని ఎంపీపీ పాఠశాల ఉపాధ్యాయులు పల్లె రవికుమార్, చిమట కృష్ణను సర్పంచి కంచర్ల చిన్నా, గ్రామ పెద్దలు గోనే విజయకుమార్, కంచర్ల జేవియర్‌రాజు, దొడ్ల జోగేశ్వరరావు తదితరులు దుశ్శాలువాలతో సత్కరించారు. స్థానిక వీఎస్ సెయింట్‌జాన్స్ హైస్కూల్‌లో టీచర్స్ డే సందర్భంగా సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి ఎన్‌సీసీ కమాండింగ్ ఆఫీసర్ లెఫ్టినెంట్ కల్నల్ డాక్టర్ సంజయ్‌జాదవ్, ప్రిన్సిపాల్ బ్రదర్ సంతోష్‌కుమార్ తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎన్‌సీసీ క్యాడెట్లు జరిపిన గుర్రపు స్వారీ విన్యాసాలు ఆకట్టుకున్నాయి. స్థానిక జెడ్పీ బాలురోన్నత పాఠశాల క్రీడా ప్రాంగణంలో గుడ్ మార్నింగ్ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులను సన్మానించారు.

ముస్తాబాదలో..

గన్నవరంరూరల్: మండలంలోని పలు పాఠశాలల్లో మంగళవారం టీచర్స్ డే వేడుకలను ఉపాధ్యాయులు ఘనంగా నిర్వహించారు. డెమోక్రటిక్ పీఆర్టీయూ మండల శాఖ ఆధ్వర్యంలో ముస్తాబాద స్పెషల్ హెచ్ఎం వి.వెంకటేశ్వరరావు, సూరంపల్లి ఎంపీపీ పాఠశాల హెచ్ఎం వెంకటరెడ్డి, వీరపనేని గూడెం జెడ్పీ హైస్కూల్ ఉపాధ్యాయులు జగన్నాథం, సుగాలి పేట ఎంపీపీ పాఠశాల హెచ్ఎం కిరణ్‌లను సత్కరించారు. ముస్తాబాద నవభారత్ హైస్కూల్‌లో డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్‌కు ఘనంగా నివాళులర్పించారు. ప్రిన్సిపాల్ షేక్ ఇమాం ఉపాధ్యాయులను సత్కరించారు. షేక్ జాకీరా సుల్తానా, హసీనా, అశోక్ రాణి, జయశ్రీ తదితరులు పాల్గొన్నారు.

కంకిపాడులో..

కంకిపాడు: మండలంలోని కోలవెన్ను, తదితర గ్రామాల్లో ఉపాధ్యాయ దినోత్సవం మంగళవారం నిర్వహించారు. జెడ్పీటీసీ సభ్యుడు బాకీ బాబు మాట్లాడుతూ విద్యార్థులను తీర్చిదిద్ది ఉత్తమ పౌరులుగా సమాజానికి అందించేది ఉపాధ్యాయులేనని చెప్పారు. కోలవెన్ను జెడ్పీపాఠశాలలో జెడ్పీటీసీ బాకీ బాబును ఉపాధ్యాయులు సన్మానించారు. గొడవర్రు జెడ్పీ పాఠశాలలో ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు. తెన్నేరు శాఖా గ్రంథాలయంలో ఉపాధ్యాయ దినోత్సవం నిర్వహించారు. చిన్నారులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి బహుమతులు అందించారు. ఈడుపుగల్లు గాంధీనగర్ ఎంపీపీ పాఠశాలలో విద్యార్థులు ఉపాధ్యాయులను సత్కరించారు.

హనుమాన్‌జంక్షన్‌లో..

హనుమాన్‌జంక్షన్‌రూరల్: బాపులపాడు మండలంలోని పలు ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో గురుపూజోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. మాజీ రాష్ట్రపతి సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. బాపులపాడు, వీరవల్లి, రేమల్లె జెడ్పీ హైస్కూళ్లలో ఉపాధ్యాయులను విద్యార్థులు సత్కరించారు. ఉపాధ్యాయుల వేషధారణలో విద్యార్థినీ, విద్యార్థులు తరగతులు నిర్వహించారు. రేమల్లెలోని ఎంపీపీ స్కూల్ ఉపాధ్యాయురాలు కంచర్ల శివ పార్వతి, విజ్ఞాన్ స్కూల్ ఉపాధ్యాయురాలు సంగోజు వరలక్ష్మి, బందారుగూడెంలోని ఫ్రాంక్ ఇంగ్లిష్ మీడియం హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు కె.ఇస్సాక్ ప్రదీప్ జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులను అందుకున్నారు.

ఉపాధ్యాయ వృత్తి పవిత్రమైనది

పి.నైనవరం(విజయవాడరూరల్): ఉపాధ్యాయ వృత్తి ఎంతో పవిత్రమైనదని లిటిల్ ఏంజెల్స్ ఇంగ్లిషు మీడియం హైస్కూల్ డైరెక్టర్ కె.హేమలత అన్నారు. తొలుత డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం సీహెచ్ రోహిణీబాబు, భవానీ ఉపాధ్యాయ దంపతులను సన్మానించారు. నున్న వెస్ట్ ఎలిమెంటరీ స్కూల్‌లో స్కూల్ అభివృద్ధి కమిటీ చైర్మన్ షేక్ హుస్సేన్, ఉపాధ్యాయులతో కలిసి మాజీ రాష్ట్రపతి సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి నివాళులర్పించారు. లయన్స్ క్లబ్ ఆఫ్ దివిసీమ ఫ్రెండ్స్ సర్కిల్ ఆధ్వర్యంలో నున్న హైస్కూల్‌లో ఉపాధ్యాయ దినోత్సవం జరిగింది. జిల్లా అవార్డు గ్రహీత, హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు వి.భూపాల్‌రెడ్డిని సత్కరించారు. కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ ప్రతినిధులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. వికాస్ ఇంజినీరింగ్ కళాశాలలో జరిగిన కార్యక్రమంలో వికాస్ విద్యా సంస్థల చైర్మన్ ఎన్.నర్సిరెడ్డి, వైస్ చైర్మన్ సత్యనారాయణరెడ్డి, అధ్యాపక బృందం పాల్గొన్నారు.

ఉయ్యూరులో..

ఉయ్యూరు: ఉయ్యూరు పట్టణం, మండలంలోని అన్ని గ్రామాల్లోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో మంగళవారం గురుపూజోత్సవం జరుపుకున్నారు. కాటూరు జెడ్పీ పాఠశాలలో ఎంపీడీఓ విమాదేవి, సర్పంచ్ కొడాలి ఆశాజ్యోతి ఉపాధ్యాయులను సన్మానించారు.

ఉయ్యూరు గ్రంథాలయంలో దళిత ఐక్యవేదిక వ్యవస్థాపకుడు నాగకుమార్ ఆధ్వర్యాన జరిగిన వేడుకల్లో మున్సిపల్ చైర్మన్ వల్లభనేని సత్యనారాయణ, కౌన్సిలర్ కూరాడ వెంకటలక్ష్మి, శివాలయం చైర్మన్ సీహెచ్ కుటుంబరాజు ఉపాధ్యాయులను సత్కరించారు. లయన్స్‌క్లబ్ ఆఫ్ ఉయ్యూరు ఆధ్వర్యాన జరిగిన వేడుకల్లో లయన్స్ ప్రతినిధులు నూకల వెంకట సాంబశివరావు, ఎండీ ఇస్మాయిల్ గురువులను సత్కరించారు. మానవతా స్వచ్ఛంద సేవాసంస్థ ఆధ్వర్యంలో ఉపాధ్యాయ దినోత్సవం జరిగింది.

ఉపాధ్యాయులకు సన్మానం

రామవరప్పాడు: రామవరప్పాడులోని శ్రీ వెంకమ్మ పేరంటాలమ్మ ఆలయంలో మంగళవారం రాత్రి టీచర్స్ డేను పురస్కరించుకుని జననీ థెరిస్సా స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో రామవరప్పాడు, ప్రసాదంపాడు గ్రామాల్లోని ప్రభుత్వ ఉపాధ్యాయులను సన్మానించారు.

ఈ సందర్భంగా సంస్థ అధ్యక్షురాలు బోయిన వెంకటేశ్వరమ్మ మాట్లాడుతూ విద్యార్థులకు విద్యాబుద్ధులతో పాటు మంచి నడవడికను నేర్పి సమాజంలో ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దుతున్న గురువులను సన్మానించడం అదృష్టంగా భావిస్తున్నామన్నారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ వరి శ్రీదేవి, వార్డు సభ్యులు అద్దేపల్లి సాంబశివనాగరాజు తదితరులు పాల్గొన్నారు.



గొడవర్రు జెడ్పీ పాఠశాలలో ఉపాధ్యాయులకు సత్కారం



ఉపాధ్యాయులను సన్మానిస్తున్న జననీథెరిసా ప్రతినిధులు



కానూరులో ప్రొఫెసర్ ఎంసీ దాస్‌కు సత్కారం



ముస్తాబాదలో ఉపాధ్యాయులను సత్కరిస్తున్న షేక్ ఇమాం



అజ్జంపూడిలో ఉపాధ్యాయులను సత్కరిస్తున్న సర్పంచ్, గ్రామపెద్దలు



ఆత్కూరు హెచ్ఎంను సత్కరిస్తున్న రోటరీ క్లబ్ సభ్యులు



కాటూరు జెడ్పీ పాఠశాలలో ఉపాధ్యాయులను సత్కరిస్తున్న ఎంపీడీఓ విమాదేవి

గృహ నిర్మాణాల పరిశీలన

ఉయ్యూరు: జగనన్న లే అవుట్‌లలో ఇళ్ల నిర్మాణాలను వేగంగా పూర్తి చేయాలని ఎంపీడీఓ విమాదేవి సూచించారు. మండలంలోని కాటూరు, కలవపాములలో మంగళవారం పర్యటించారు. గృహ నిర్మాణాల పురోగతిపై హౌసింగ్ ఏఈ యార్లగడ్డ బుల్లయ్యతో సమీక్షించారు. లబ్ధిదారులకు ఇళ్ల నిర్మాణాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు కొడాలి ఆశాజ్యోతి, పొనుగుమాటి బాలస్వామి పాల్గొన్నారు.

విద్యార్థి అదృశ్యం

పెనమలూరు: తండ్రి మందలించడంతో ఓ విద్యార్థి అదృశ్యమయ్యాడు. పెనమలూరు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం యనమలకుదురు వడ్డెర కాలనీకి చెందిన తమ్మిశెట్టి వీరాస్వామికి ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. అతని రెండో కుమారుడు సాయిరామ్ విజయవాడలో డిగ్రీ చదువుతున్నాడు. అతను గత నెల 28వ తేదీ కళాశాలకు వెళ్తున్నానని చెప్పి కాలేజీకి వెళ్లకుండా రైల్వేస్టేషన్ ప్రాంతంలో తిరిగాడు. విషయం తెలుసుకున్న తండ్రి వీరాస్వామి ఆ రోజు సాయంత్రం ఇంటికి వచ్చిన సాయిరామ్‌ను మందలించాడు. అతను గత నెల 29వ తేదీ ఉదయం ఇంటి నుంచి అదృశ్యమయ్యాడు. అతని కోసం పలు ప్రాంతాల్లో కుటుంబ సభ్యులు వెదికారు. అయినా ఫలితం లేకపోవడంతో అతని తండ్రి ఇచ్చిన ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు.

విద్యార్థులకు సృజనాత్మకత పోటీలు

పటమ(విజయవాడతూర్పు): స్వచ్ఛమైన వాతావరణాన్ని అందించేందుకు ప్రజలందరూ సహకరించాలని వీఎంసీ అదనపు కమిషనర్(ప్రాజెక్ట్స్) కె.వి.సత్యవతి కోరారు. ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో నాలుగో అంతర్జాతీయ స్వచ్ఛమైన గాలి, నీలి ఆకాశం దినోత్సవం సందర్భంగా నగరంలోని అన్ని పాఠశాలల విద్యార్థులకు మంగళవారం డ్రాయింగ్ పోటీలు, సైన్స్ ఫెయిర్, సృజనాత్మకత పోటీలు నిర్వహించారు. పోటీలను ప్రారంభించిన అనంతరం ఏసీ మాట్లాడుతూ.. బాల్యం నుంచే ప్రకృతి, పర్యావరణంపై అవగాహన కల్పించాలన్నారు. పెరుగుతున్న కాలుష్యాన్ని నిరోధించేందుకు విద్యార్థుల్లో కాలుష్యాన్ని తగ్గించే సృజనాత్మకమైన ఆలోచనలను రేకెత్తించాలని చెప్పారు. వాయు కాలుష్యం ప్రభావం అనే అంశంపై మూడు విభాగాల్లో పోటీలు నిర్వహించారు.

మధురం వాగ్గేయకార సంకీర్తనం

విజయవాడకల్చరల్: ప్రముఖ వయోలిన్ విద్వాంసురాలు గద్దే వెంకట రామకుమారి జయంతి సందర్భంగా స్వరఝరి సంగీత సంస్థ ఆధ్వర్యంలో దుర్గాపురంలోని శివరామకృష్ణ క్షేత్రంలో మంగళవారం నిర్వహించిన అంబటిపూడి కామాక్షి వయోలిన్ సోలో కచేరీ మధురంగా సాగింది. సంగీత మూర్తిత్రయం త్యాగరాజ స్వామి, ముత్తుస్వామి దీక్షితార్ శ్యామ శాస్త్రి, రచించిన కీర్తనలను వయోలిన్‌పై మధురంగా పలికించారు. కుందుర్తి అరవింద్ మృదంగంపై, ఎం.హరిబాబు ఘటంపై సహకరించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న సంగీత విద్వాంసుడు మోదుమూడి సుధాకర్ మాట్లాడుతూ.. రామకుమారి సుదీర్ఘకాలం సంగీత కళాశాలలో అధ్యాపకురాలిగా పని చేశారన్నారు.

తెలుగువారి గుండె చప్పుడు ఘంటసాల



విజయవాడకల్చరల్: తెలుగు వారి గుండెచప్పుడు ఘంటసాల వెంకటేశ్వరరావు అని శాతవాహన కళాశాల కరస్పాండెంట్ నిడుమోలు రమా సత్యనారాయణ అన్నారు. సంగీత కళాకారుడు పప్పు సదాశివశాస్త్రి ఆధ్వర్యంలో సినీ సంగీత దర్శకులు, గాయకులు ఘంటసాల వెంకటేశ్వరరావు, ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం, ఏసుదాసుల స్ఫూర్తి కార్యక్రమం సినీ సంగీత విభావరినిర్వహించారు. పప్పు సదాశివ శాస్త్రి, గుడిపాటి జయరాం ప్రసాద్, మల్లాది స్వాతి తదితరులు గీతాలాపన చేశారు.

ఎస్సీల సంక్షేమంపై టీడీపీది దుష్ప్రచారం

'గడప గడప'లో ఎమ్మెల్యే పార్థసారథి



ఉయ్యూరు ఎస్సీ కాలనీలో సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే పార్థసారథి

ఉయ్యూరు: ఎస్సీల సంక్షేమంపై టీడీపీది దుష్ప్రచారమేనని ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి చెప్పారు. ఉయ్యూరు ఎస్సీ కాలనీ ఐదో వార్డులో గురువారం 'గడప గడపకు మన ప్రభుత్వం' నిర్వహించారు. ఎమ్మెల్యే పార్థసారథి ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల బ్రోచర్లను అందించారు. సంక్షేమ పాలనపై ప్రజాభిప్రాయం సేకరించారు. ఈ సందర్భంగా స్థానికులు విద్యుత్, డ్రెయినేజీ సమస్యను ఎమ్మెల్యే పార్థసారథి దృష్టికి తీసుకొచ్చారు. వాటిపై విద్యుత్ శాఖ ఏఈ నాగమల్లేశ్వరరావు, కమిషనర్ వెంకటేశ్వరరావుతో సమీక్షించి పరిష్కారానికి సూచించారు. ఆర్డీఓ విజయ్ కుమార్, తహసీల్దార్ మస్తాన్‌తో రెవెన్యూ సమస్యలపై చర్చించి పరిష్కరించాలని చెప్పారు. ఎమ్మెల్యే పార్థసారథి మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పారదర్శక పాలనలోనే అన్ని వర్గాలూ అభివృద్ధి చెందుతున్నాయన్నారు. ఎవరైనా ఎస్సీల్లో పుట్టాలనుకుంటారా? చెప్పిన చంద్రబాబు ఎస్సీల సంక్షేమంపై మాట్లాడటం దెయ్యా లు వేదాలు వల్లించినట్లుగా ఉందన్నారు. జగనన్నతోనే ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు నడుస్తున్నారన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ వల్లభనేని సత్యనారాయణ (నాని), వైస్‌చైర్మన్లు సోలే సురేష్‌బాబు, అర్షతున్నీసాబేగం, కమిషనర్ పాయసం వెంకటేశ్వరరావు, ఆ వార్డు ఇన్‌చార్జి దిరిశం జ్యోతిర్మయి, నాయకులు ఈడుపుగంటి డేవిడ్, కలకట్ల డాలి, నందేటి ప్రవీణ్, మట్టా మనోజ్, ఉయ్యూరు సుధాకర్, ప్రభుత్వాసుపత్రి చైర్మన్ జంపాన కొండలరావు, పార్టీ జిల్లా ఉపాధ్యక్షురాలు తెనాలి పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

వైద్య విద్య యజ్ఞం వంటిది

వైద్య నిపుణుడు కాట్రగడ్డ రఘురాం



జ్యోతి ప్రజ్వలన కార్యక్రమంలో డాక్టర్ రఘురాం, డైరెక్టర్ జనరల్ డాక్టర్ నాగేశ్వరరావు, ప్రతినిధులు

గన్నవరంరూరల్: వైద్య విద్య యజ్ఞం వంటిదని, విద్యార్థులు క్రమశిక్షణగా చదివి రాణించాలని డాక్టర్ కాట్రగడ్డ రఘురాం అన్నారు. మండలంలోని చిన అవుటపల్లి డాక్టర్ పిన్నమనేని సిద్ధార్థ మెడికల్ కళాశాలలో మంగళవారం 2023–24 విద్యా సంవత్సరానికి 21వ బ్యాచ్‌గా చేరిన ఎంబీబీఎస్ విద్యార్థినీ విద్యార్థుల తరగతుల ప్రారంభం సందర్భంగా ఆయన సందేశమిచ్చారు.

కళాశాల డైరెక్టర్ జనరల్ డాక్టర్ సి.నాగేశ్వరరావు అధ్యక్షతన జరిగిన సభలో డాక్టర్ రఘురాం మాట్లాడుతూ రోగులు ప్రత్యక్ష్యంగా కొలిచే దేవుడి రూపం డాక్టర్ అని, అంత గొప్ప స్థానం ప్రజల్లో కలిగిన వైద్యులు సమాజానికి బాధ్యతగా సేవ చేయాలని చెప్పారు. డాక్టర్ నాగేశ్వరరావు మాట్లాడుతూ వైద్య విద్యార్థులు విద్య నేర్పటంతో పాటు వినయం, ఓర్పు, దయ కలిగి ఉండాలన్నా రు. డైరెక్టర్ డాక్టర్ సీవీ రావు, ప్రిన్సిపాల్ డాక్టర్ డి.రంగారావు, మెడికల్ సూపరింటెండెంట్ బి.అనిల్‌కుమార్, డెప్యూటీ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ కె.కళ్యాణి, హెచ్‌వోడీలు ఈశ్వర్, స్వాతి పూర్ణిమ పాల్గొన్నారు.

స్వచ్ఛంద సంస్థ సేవలు స్ఫూర్తిదాయకం

ఎమ్మెల్యే డాక్టర్ వంశీ



చిన అవుటపల్లి స్కూల్‌లో కిచెన్ షెడ్ ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వంశీ, నాయకులు

గన్నవరంరూరల్: ప్రభుత్వ పాఠశాలల్లో ఉత్తమ విద్య, మెరుగైన సౌకర్యాల కోసం ప్రభుత్వం వేలకోట్లు ఖర్చు చేస్తోందని ఎమ్మెల్యే డాక్టర్ వల్లభనేని వంశీ అన్నారు. మండలంలోని చిన అవుటపల్లి ఎంపీయూపీ పాఠశాలలో గ్రామానికి చెందిన స్వచ్ఛంద సంస్థ పల్లెవెలుగు వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కొత్తగా నిర్మించిన వంట షెడ్డును మంగళవారం ఎమ్మెల్యే వంశీ గ్రామస్తులతో ప్రారంభింపజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ గోగులమూడి విజయలక్ష్మి, గ్రామ వైఎస్సార్‌సీపీ కన్వీనర్ కోట వినయ్‌కుమార్, జిల్లా యువజన విభాగం కార్యదర్శి దగాని ఇస్సాక్, హెచ్ఎం జేమ్స్, మండల పార్టీ కన్వీనర్ నీలం ప్రవీణ్‌కుమార్, మేచినేనిబాబు, పార్టీ నాయకులు గోగులమూడి దుర్గారావు, పల్లె వెలుగు వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు సరిహద్దు నాగరాజు, ప్రధాన కార్యదర్శి చల్లా కరుణాకర్, కాంద్రు రాజశేఖర్, పాపట్ల సురేష్, పి.రమేష్ తదితరులు పాల్గొన్నారు.

అభయాంజనేయుని సన్నిధిలో అన్నదానం

హనుమాన్‌జంక్షన్‌రూరల్: ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన అభయాంజనేయ స్వామి దేవస్థానంలో మంగళవారం విశేష పూజలు, అన్నదానం నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో 200 మంది భక్తులకు అన్నదానం నిర్వహించారు. హనుమాన్‌జంక్షన్‌కు చెందిన చలసాని హనుమాన్ చౌదరి, చలసాని రామ్‌ప్రకాష్ ఈ అన్నదానం నిర్వహణకు విరాళం అందజేశారు. దెందులూరు ఏఎంసీ చైర్మన్ అప్పన కనకదుర్గాప్రసాద్, ఆలయ పాలకమండలి చైర్మన్ నెరుసు భూషణం, ఈవో కూచిపూడి శ్రీనివాస్ పాల్గొన్నారు.

బాలిక పేరుతో ఫేస్‌బుక్ ఖాతా!

వేధిస్తున్న గుర్తు తెలియని వ్యక్తిపై కేసు

పెనమలూరు: బాలికను వేధిస్తున్న గుర్తు తెలియని వ్యక్తిపై పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. వణుకూరు కాసాకాలనీకి చెందిన మహిళకు ఏడో తరగతి చదివే కుమార్తె ఉంది. బాలిక పేరుతో గుర్తు తెలియని వ్యక్తి ఫేస్‌బుక్ ఖాతా తెరిచాడు. ఆ ఖాతాలో బాలిక తప్పుడు ఫొటోలు పెట్టి ఆమె తల్లి ఫోన్ నంబర్ జోడించాడు. బాలిక తల్లి ఫోన్‌కు తరచుగా కాల్స్ రావటంతో ఫోన్ చేస్తున్న వారిని నిలదీయగా ఫేస్‌బుక్ విషయం తెలిసింది. దీంతో ఘటనపై ఆమె పోలీసులకు ఫిర్యాదు చేసింది. వారు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నారు.